క్లుప్తంగా

వైభవంగా సుమంగళి గౌరీ పూజ


పూజలో పాల్గొన్న మహిళలు

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ వద్ద శుక్రవారం రాత్రి మహిళలు సుమంగళి గౌరీ పూజ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. రాత్రి ఉపవాస దీక్షలతో మహిళలు గౌరీ పూజ చేపట్టి ఎలాంటి కీడు కలగకుండా చూడాలని ప్రార్థించారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

పుంగనూరు: పట్టణంలోని కొత్తయిండ్లు వద్ద శనివారం రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. మండలంలోని కొత్తపల్లెకు చెందిన శంకర్‌రెడ్డి(29) బైక్‌లో మదనపల్లె వెళుతున్నాడు. అదే సమయంలో పట్టణంలోని ఎన్‌ఎస్.పేటకు చెందిన రాజీవ్(25) మదనపల్లె నుంచి పుంగనూరు వస్తున్నాడు. కొత్తయిండ్లు వద్ద రెండు బైక్‌లు ఢీకొన్నాయి. గాయపడిన ఇద్దరిని స్థానికులు 108 ద్వారా ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీహెచ్‌సీ తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సుధారాణి

గుడుపల్లి: ఆస్పత్రికి వచ్చే రోగులతో వైద్య సిబ్బంది స్నేహ పూర్వకంగా మెలగాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి తెలిపారు. ఆమె శనివారం గుడుపల్లె పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఓపీలను పెంచి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయి అధికారులను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ యాప్‌లను వంద శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంవో ప్రవీణ్, స్థానిక వైద్యులు పాల్గొన్నారు.

నేడు ఉర్దూ కవితా పారాయణం

పుంగనూరు: మండలంలోని దారుల్‌హుదా కళాశాలలో ఆదివారం సాయంత్రం ఉర్దూ కవితా పారాయణం నిర్వహించనున్నట్టు ముస్లిం మత పెద్దలు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త జన్మించి 1500 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ముస్లిం వక్తలు, కవులతో ఉర్దూ పారాయణం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొని, మహమ్మద్ ప్రవక్త సూక్తులను ఆచరించాలని కోరారు.

బ్యాగుల పంపిణీ


పిల్లలతో అధికారులు, చేనేత సంఘం నేతలు

సదుం: మండలంలోని జాండ్రపేట అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు శనివారం గ్రామీణ వికాస్, చేనేత సంఘం ఆధ్వర్యంలో బ్యాగులు పంపిణీ చేశారు. ఐవోబీ మేనేజరు గురుప్రకాశ్ మాట్లాడుతూ చేనేత కార్మికుల అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌సీ విశ్వనాథం, అంగన్‌వాడీ కార్యకర్త అనసూయ, చేనేత సంఘం నాయకులు కృష్ణయ్య, విజయ్, రామ్మూర్తి, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, ఈశ్వరయ్య, రవి పాల్గొన్నారు.

పౌరుల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

సదుం: పౌరుల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని డీటీ కిశోర్ హెచ్చరించారు. మండలంలోని పాలమంద మిట్టపల్లెలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. పాలమంద, ఊటుపల్లె, మద్దెలవారిపల్లెలో నెలకొన్న భూసమస్యలు పరిష్కరించాలని పలువురు వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో వివాదాలకు తావు లేకుండా కలిసిమెలిసి జీవించాలని ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ షరీఫ్, బాస్ నియోజవర్గ అధ్యక్షుడు సీతాపతి పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం


పూజలో పాల్గొన్న జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి

సదుం: వినాయక చవితి సందర్భంగా మండలంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను శనివారం నిమజ్జనం చేశారు. పాలమంద పెద్దూరులో ఏర్పాటు చేసిన విగ్రహ నిమజ్జనంలో జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేళతాళాలతో స్వామి వారిని ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు.

గుంతలమయం

- వర్షాలకు గుంతలు పడిన వైనం
- ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి
- పట్టించుకోని అధికారులు, పాలకులు


గుంతలమయమైన బైరెడ్డిపల్లి మండలం కడపనత్తం రోడ్డు

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో రహదారులు అధ్వానంగా మారాయి. తాము అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే రోడ్లను బాగు చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం తర్వాత పట్టించుకోలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లలో పెద్ద పెద్ద గుంతలు పడడంతో ద్విచక్రవాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

- పలమనేరు మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ ఎర్రగొండేల్లి- మాదిగబండ రోడ్డుపై నాలుగు అడుగుల నీరు చేరి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అదేవిధంగా చెన్నుపల్లి నుంచి కల్లాడు దాకా రోడ్డు గుంతలమయమైంది.
- కొలమాసనపల్లి నుంచి నెల్లిపట్లకు వెళ్లే రోడ్డులో కనీసం ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది.


పలమనేరు మండలం మాదిగబండ రోడ్డు పరిస్థితి,

- బైరెడ్డిపల్లి మండలంలోని కడపనత్తం రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. ఈ మార్గంలో కనీసం ఆటోలు సైతం వెళ్లడం లేదు.
- పెద్దపంజాణి మండలంలోని చెన్నారెడ్డిపల్లి రోడ్డు వర్షాల కారణంగా బురదమయమైంది. ఈ మార్గంలో ద్విచక్ర వాహనాల్లో వెళ్లాలన్నా వీలు కాని పరిస్థితి నెలకొంది.


చెన్నుపల్లి- కల్లాడు రోడ్డు దుస్థితి

- గంగరవం మండలంలోని కీలపట్ల రోడ్డు సైతం అధ్వానంగా మారింది.

రోడ్డుపై గుంతలో ఇరుక్కుపోయిన కంటైనర్


గుంతలోకి దిగి ఇరుక్కుపోయిన కంటైనర్

గంగవరం: మండలంలో రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. శనివారం గంగవరం ఫ్లైఓవర్ ఆనుకుని హైవేలో ఏర్పడిన పెద్ద గుంతలో బెంగళూరు నుంచి మదనపల్లి వైపు వెళ్తున్న గూడ్స్ కంటైనర్ ఇరుక్కుపోయింది. లారీని లాగేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేదు. చివరికి అధికారులు వేరొక వాహనం సాయంతో బయటికి తీశారు. రోడ్లను బాగు చేయాలని పలుమార్లు అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పుంగనూరు: పట్టణంలోని బీఎంఎస్ క్లబ్ ఆవరణ లో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ పి.శివ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు వైద్యులు రోగులను పరీక్షించి మందులు, అద్దాలు అందజేస్తారని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని తెలిపారు.

ధ్వజస్తంభం ఏర్పాటు పనులు ప్రారంభం


ధ్వజ స్తంభ దారువుకు పూజలు చేస్తున్న అర్చకులు

పుంగనూరు: పట్టణంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఈవో కమలాకర్ ఆధ్వర్యంలో నూతన ధ్వజ స్తంభం ఏర్పాటు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బాలసుబ్రమణ్యం, రాములు ధ్వజస్తంభ పనులకు పూజలు చేశారు. సుమారు రూ.4 లక్షలు ఖర్చు చేసి ఇత్తడి తొడుగుతో ధ్వజ స్తంభం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

3న మండల సమావేశం

పుంగనూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సెప్టెంబర్ 3న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లీలామాధవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, కో ఆప్షన్ సభ్యులు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

కూటమి మోసాలను జనానికి వివరిద్దాం


మాట్లాడుతున్న కన్వీనర్ బాలాజీనాయుడు

పలమనేరు: కూటమి మోసాలను ఇంటింటికి వెళ్లి జనానికి వివరిద్దామని వైఎస్సార్ సీపీ పలమనేరు మండల కన్వీనర్ బాలాజీనాయుడు పిలుపునిచ్చారు. ఆయన శనివారం కూర్మాయి పంచాయతీలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కోఆర్డినేటర్ వెంకటేగౌడ ఆధ్వర్యంలో సోమవారం నుంచి కొలమాసనపల్లిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం ప్రారంభించనున్నట్టు తెలిపారు. గత ఎన్నికల్లో అలవిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు జనాన్ని నిలువునా మోసం చేస్తున్నారని ఆరోపించారు. కొన్ని పథకాలు అమలుచేసి చేతులు దులుపుకుంటున్నారని దుయ్యబట్టారు. కూటమి మోసాలను జనానికి అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో కూర్మాయి పంచాయతీ అధ్యక్షుడు ఆర్ గిరిధర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు శ్రీనివాసులు రెడ్డి, మహిళా అధ్యక్షురాలు లక్ష్మమ్మ, యూత్ నాయకులు సురేష్‌బాబు, చెంగారెడ్డి, జెడ్పీటీసీ మల్లిక రంగన్న, సర్పంచు చెంగమ్మ మోహన్ రెడ్డి, ఎంపీటీసీ నాగరత్న, మండల యూత్ ప్రెసిడెంట్ బేరుపల్లి గోవిందురెడ్డి, కొండారెడ్డి, రాహుల్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంటెక్, ఎంబీఏ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న కళాశాల చైర్మన్, వైస్ చైర్మన్

కుప్పం రూరల్: కుప్పం ఇంజినీరింగ్ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో జూలైలో నిర్వహించిన ఎంటెక్, ఎంబీఏ రెండో సెమిస్టర్ ఫలితాలను శనివారం చైర్మన్ బీసీ నాగరాజు, వైస్ చైర్మన్ సునీల్ రాజ్, అనంతపురం జేఎన్‌టీయూ పరిశీలకులు వీబీ చిత్ర విడుదల చేశారు. ఈ ఫలితాల్లో కుప్పం ఇంజినీరింగ్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు బీసీ నాగరాజు తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో ఏకాంబరం 89.19 శాతం మార్కులతో మొదటిస్థానం, పవర్ ఎలక్ట్రానిక్స్‌లో దయాసాగర్ 88.75 శాతం మార్కులతో రెండో స్థానం, పఠాన్ గౌసల్ ఆజం 86.89 శాతం మార్కులతో తృతీయ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. అదే విధంగా ఎంబీఏ రెండో సెమిస్టర్‌లో సౌమ్యశ్రీ 87.13 శాతం మార్కులతో ప్రథమ స్థానం, నాగలక్ష్మీ 87 శాతం మార్కులతో రెండో స్థానం, హర్షిత 83.25 శాతం మార్కులతో మూడవ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. వారిని అధ్యాపకులు అభినందించారు. సెక్రెటరీ సాగర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వసతి భవనాల నిర్మాణ పనులకు భూమి పూజ


కమ్మనపల్లెలో వసతి భవనాలకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, ఫౌండేషన్ నిర్వాహకులు

బైరెడ్డిపల్లి: మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో వసతి భవనాలను రూ.2 కోట్లతో నిర్మించేందుకు శ్రీ లక్ష్మీప్రసాద్ చారిటీస్ ఫౌండేషన్ ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో శనివారం పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమరనాథరెడ్డి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలలో వసతి భవనాల నిర్మాణానికి ముందుకొచ్చిన ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు వంశీధర్, సత్య, ప్రిన్సిపాల్ సుమిత్ర, ఏపీఆర్ ఈఐ సొసైటీ సెక్రటరీ మస్తానయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు కిషోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, సింగిల్‌విండో చైర్మన్ నాగరాజు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానంపై టీచర్లకు శిక్షణ

పుంగనూరు: స్థానిక బసవరాజ హైస్కూల్‌లో శనివారం నూతన విద్యావిధానంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఎంఈవో నటరాజారెడ్డి మాట్లాడుతూ నూతన విద్యావిధానానికి అనుగుణంగా అనుసరించాల్సిన బోధనా పద్ధతులు, తీసుకోవాల్సిన మెళకులవలపై వివరించారు. పిల్లలకు అర్థమయ్యేలా బోధన చేయాలని సూచించారు.

బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ నిర్వహణపై సమావేశం


సమావేశంలో పాల్గొన్న జరావారిపల్లి పంచాయతీ వైఎస్సార్ సీపీ నేతలు

పలమనేరు: మండలంలోని జరావారిపల్లిలో శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలంలో సోమవారం నుంచి బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహణపై పార్టీ కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బాలాజీనాయుడు, రాష్ట్ర కార్యదర్శులు రంగన్న, చెంగారెడ్డి, పంచాయతీ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, యూత్ నాయకులు శంకర్‌రెడ్డి, రైతు విభాగం నేత రెడ్డెప్పరెడ్డి, మహిళా విభాగం నేత సుమతి, బెంగళూరు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుపైకి చేరిన మురుగు నీరు


కొండయ్యగారిపల్లెలో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

చౌడేపల్లె: మండలంలోని కొండయ్యగారిపల్లెలో మురుగు నీరు రోడ్డుపై నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. కాలువలను శుభ్రం చేయకపోవడంతో మురుగు ముందుకు కదలక నీరు రోడ్డుపైకి వస్తోందని చెబుతున్నారు. దీంతో దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలుతున్నాయని పేర్కొంటున్నారు. కాలువలను శుభ్రం చేయాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

కుక్కల బెడదను నివారించండి


మాట్లాడుతున్న చైర్మన్ అలీమ్‌బాషా, పక్కన కమిషనర్ మధుసూదనరెడ్డి

పుంగనూరు: పట్టణంలో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం సాయంత్రం కమిషనర్ మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లు త్యాగరాజు, కై రున్నీసా మాట్లాడుతూ పట్టణంలో కుక్కలు, దోమల బెడద తీవ్రంగా ఉందని తెలిపారు. పారిశుద్ధ్యం లోపించడంతోనే దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన చైర్మన్ పారిశుద్ధ్య పనులను మెరుగు పరిచి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అజెండాలోని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెలా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. క్లోరినేషన్ చేసి నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించామని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడతామని హామీ ఇచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కుక్కల నివారణకు చర్యలు చేపడతామన్నారు. దోమల నివారణకు ప్రతి రోజూ ఫాగింగ్ చేస్తామని వెల్లడించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు నాగేంద్ర, సిఆర్.లలిత, డీఈఈ మహేష్, టీపీఎస్ జగదీశ్వర్‌రెడ్డి, ఆర్‌ఐలు నరేంద్రరాజు, నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రూపేష్‌కుమార్, మునివెంకటప్ప పాల్గొన్నారు.

బీసీ నాయకురాలిపై దాడి హేయం


బాధితురాలిని పరామర్శిస్తున్న నాయకులు

గంగవరం: గంగవరం మండల వైఎస్సార్ సీపీ బీసీ నాయకురాలు కవిత, ఆమె సోదరి నందిని, తల్లి తుమ్మలమ్మపై టీడీపీ మూకలు తేజ, అతని కుటుంబీకులు దాడి చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు శనివారం పలమనేరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరిగాయన్నారు. ఈవ్ టీజింగ్ కేసులో రాజీకి రాలేదని ఆగ్రహించి దాడి చేయడమే కాకుండా చంపేస్తామని బెదిరించారని ఆరోపించారు. గ్రామంలో వినాయక చవితి పండుగ సంబరాలు చేసుకోకుండా టీడీపీ నేతలు ఆంక్షలు విధించారని, వినని వారిపై పోలీసులతో కేసులు బనాయించడం, కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. బాధితుల ఫిర్యాదు స్వీకరించి నిందితులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధితులకు రక్షణ కల్పించాలని కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఆస్పత్రి కమిటీ మాజీ అధ్యక్షుడు చెంగారెడ్డి, పెద్దపంజాణి కన్వీనర్ బాగారెడ్డి, నాయకులు చంద్రప్ప, గిరిరాజారెడ్డి, యర్రబల్లి శ్రీనివాసులు, విజయ్, మంజునాథ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలపై పెరిగిన దాడులు


పచ్చమూకల దాడిలో గాయపడిన బాధితులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు

పలమనేరు: గంగవరం మండల వైఎస్సార్ సీపీ బీసీ మహిళా అధ్యక్షురాలిపై పచ్చమూకల దాడి అమానుషమని ఆ పార్టీ జిల్లా నాయకురాలు జమీలా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె శనివారం పలమనేరు నియోజకవర్గ పార్టీ మహిళా విభాగం నాయకురాళ్లతో కలిసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై పచ్చమూకల దాడులు పెరిగాయని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా పోలీసులు తగిన చర్యలు తీసుకోవడం ఏదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయని, కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకురాళ్లు పుష్ప, ఉషా, నౌజియా, బద్రూన్ తదితరులు పాల్గొన్నారు.

గణేశుడి లడ్డూ రూ.1.21 లక్షలు


వినాయక లడ్డూను దక్కించుకున్న యువకులు

రొంపిచెర్ల: స్థానిక గ్రామ పంచాయతీ వారణాసివారిపల్లెలో శనివారం జరిగిన వేలం పాటలో గణేశుడి లడ్డూ రూ.1,21,116 లక్షలు పలకడం విశేషం. చవితి సందర్భంగా గణపయ్యకు 13 కిలోల లడ్డూను నైవేద్యం సమర్పించిన అనంతరం వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన సుబ్బు, చందు, కార్తీక్, సూరి, రెడ్డి, రాజా, అజయ్ తదితరులు కలిసి వేలంలో లడ్డూను దక్కించుకున్నారు.

పకడ్బందీగా వైరల్ ఫీవర్ సర్వే


బెస్తపల్లెలో సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: గ్రామాల్లో వైరల్ జ్వరాలు, అతిసారం(డయేరియా) సర్వేలు పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప సూచించారు. శనివారం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వైరల్ జ్వరాలు, అతిసారం ప్రబలే అవకాశం ఉందన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రతి ఇంటిలో క్షుణ్ణంగా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతిరోజూ నీటిని వేడి చేసి తాగాలన్నారు. దోమల నివారణకు సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వైరల్ ఫీవర్ వచ్చే ప్రాంతాలపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా నివారించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. సాధారణ కంటే జ్వరాలు, అతిసారం కేసులు ఏ ప్రాంతంలో అయినా అధికమైతే వెంటనే సమాచారం పంపాలన్నారు. వైరల్ జ్వరాలు సోకితే వెంటనే స్థానిక పీహెచ్‌సీలో రక్తపరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. నీటి కలుషితం కారణంగా వచ్చే అతిసార వ్యాధులపై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించే వైద్య సిబ్బంది ఓఆర్ఎస్ ద్రావణం, మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి తీవ్ర గాయాలు

పుంగనూరు: మండలంలోని చిన్నఅలసాపురం వద్ద శనివారం విద్యుత్ షాక్‌తో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. చిన్న అలసాపురానికి చెందిన నారాయణరెడ్డి(65) శనివారం పశువులను మేపుకునేందుకు గ్రామ సమీపంలోకి వెళ్లాడు. ఎగువచెరువు సమీపంలో విద్యుత్ వైర్లు తగిలి షాక్ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు అతన్ని 108 ద్వారా స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు మెరుగైన వైద్యం కోసం బెంగళూరు ఆసుపత్రికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను కాపాడిన జాలర్లు

పుంగనూరు: పట్టణంలోని కొత్తయిండ్లలో శనివారం చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన మహిళను జాలర్లు కాపాడారు. పోలీసుల కథనం మేరకు.. కొత్తయిండ్లుకు చెందిన నివాసం ఉన్న మల్లీశ్వరి(35) కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందింది. ఈ క్రమంలో శనివారం స్థానిక పుంగమ్మ చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించింది. ఈ విషయాన్ని అక్కడ చేపలు పట్టుకుంటున్న జాలర్లు గమనించారు. వెంటనే ఆమెను కాపాడారు. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రాజేష్, రియాజ్ చెరువు వద్దకు చెరుకుని మహిళను కుటుంబ సభ్యులకు అప్పగించారు. సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టును ఢీకొన్న కారు-ముగ్గురికి గాయాలు


బూరగపల్లె వద్ద చెట్టును ఢీకొన్న కారు

చౌడేపల్లె: చౌడేపల్లె- సోమల రోడ్డులోని బూరగపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి చెట్టును కారు ఢీకొన్న ఘటన శనివారం జరిగింది. సోమల వైపు నుంచి చౌడేపల్లెకు వస్తున్న కారులో ఐదుగురు ప్రయాణిస్తుండగా వారిలో ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బుద్ధిమాంద్యం పిల్లలకు భోజనం


పిల్లలకు భోజనం పెడుతున్న శ్రావణి

పలమనేరు: పట్టణ సమీపంలోని అక్షర బుద్ధిమాంద్యం విద్యార్థులకు శనివారం మొరం గ్రామానికి చెందిన శ్రావణి ఒక పూట భోజనం పెట్టారు. ఇలాంటి పిల్లలకు భోజనం పెట్టడం సంతోషంగా వుందని ఆమె పేర్కొన్నారు.